'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

నిరుద్యోగుల పోరుబాట

అధికారం మీద యావతో కాంగ్రెస్ పార్టీ శతానేక హామీలిచ్చి జనాన్ని మాయచేసింది. అందులో రెండు లక్షల ఉద్యోగాలిస్తామనేది కీలకమైనది. నిరుద్యోగులు ఈ హామీపై చాలానే ఆశలు పెట్టుకున్నారు. ఇంకా నమ్మరేమోననే అనుమానంతో ఇదిగో జాబ్ క్యాలెండర్, అదిగో తేదీలంటూ ఊరించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తాము చెప్పిన రెండు లక్షల ఉద్యోగాలను మొదటి ఏడాదిలోనే ఇచ్చేస్తామని మరికొంత బులిపించారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ పార్టీ పలు పత్రికల్లో పెద్ద పెద్ద ప్రకటనలు కూడా విడుదల చేసింది. నిరుద్యోగుల్లో అనవసరమైన భయాందోళనలు కల్పించి, ఆపై అలవిమాలిన హామీలిచ్చి తమ వైపు తిప్పుకొనేందుకు అన్ని రకాలుగా ప్రయత్నించింది. కొందరు మేధావులు ఆ సమయంలో కాంగ్రెస్ హామీలకు విశ్వసనీయతను కల్పించేందుకు తంటాలు పడిన సంగతి తెలిసిందే.

రేవంత్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కి ఏడు మాసాలు కావస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం నోటిఫికేషన్లు, ఇతరేతర తంతు పూర్తిచేసి ఎన్నికల కారణంగా వాయిదా వేసిన ఉద్యోగాల పత్రాలను అట్టహాసంగా అందజేసి ప్రభుత్వం తన జబ్బలు చరచుకున్నది. ఆ ఒక్కటంటే ఒక్క నోటిఫికేషన్ విడుదల చేసిందీ లేదు, ఉద్యోగాలు భర్తీ చేసిందీ లేదు. మరో ఐదు నెలల్లో గోడ మీది క్యాలెండర్ మారిపోతుంది. జాబ్ క్యాలెండర్ అప్పటికైనా గోడ మీదకు వచ్చే సూచనలు ఇప్పటికైతే కనిపించడం లేదు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగమైన పది నోటిఫికేషన్ల గడువు ముగిసిపోయింది. జాబ్ క్యాలెండర్ అనేది తమపాలిట క్రూర హాస్యమైందని నిరుద్యోగులు గ్రహించారు. నమ్మించి నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ సర్కారుపై కదనభేరి మోగించారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగ జేఏసీ నాయకుడు మోతీలాల్ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష సర్కారు వెన్నులో వణుకు పుట్టిస్తున్నది. ఇప్పటికీ సర్కారు నిర్దిష్టమైన ప్రణాళికను ప్రకటించకుండా చర్చలంటూ తాత్సారం చేయజూస్తున్నది. గాంధీ దవాఖానలో దీక్ష కొనసాగిస్తున్న మోతీలాల్ వద్దకు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను పంపించి పైపై హామీలతో సర్దుబాటు చేసేందుకు జరిపిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. సీఎం స్పష్టమైన హామీ ఇస్తేనే దీక్ష విరమిస్తానని మోతీలాల్ తెగేసి చెప్పడంతో సర్కారు ఇరుకునపడింది.

ఇంత జరుగుతున్నా ఆనాడు రాహుల్‌గాంధీని అశోక్‌నగర్ కోచింగ్ సెంటర్లలో తిప్పి హామీలిప్పించిన కోదండరాం వంటి నేతలు పెదవి విప్పకపోవడం గమనార్హం. మరోవైపు బీఆర్‌ఎస్ సహా పలు పార్టీలు, ప్రజాసంఘాలు నిరుద్యోగుల పోరాటానికి మద్దతు ప్రకటించాయి. రోజురోజుకు ఆందోళనను ఉధృతం చేస్తున్న నిరుద్యోగులకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డిపై ఉన్నది. ఇందుకు ఆయన ముందున్న మార్గాలు రెండు. ఒకటి, ఆలస్యంగానైనా భర్తీ ప్రక్రియకు సరికొత్తగా శ్రీకారం చుట్టడం. రెండు, అమలు చేయలేని హామీలు ఇచ్చినందుకు లెంపలు వేసుకుని క్షమాపణ వేడుకోవడం. ఈలోగా నిరుద్యోగుల ఆందోళన చేయిదాటితే అందుకు పూర్తి జవాబుదారీ సర్కారుదే.

సాడే సాత్ సర్కారిది

జి.దేవీప్రసాద్ రావు

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరి సుమారు ఏడు నెలలు కావస్తున్నది. వంద రోజుల్లో నెరవేరుస్తామన్న హామీలు నెరవేరకపోగా పరిపాలన గాడి తప్పుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒక్కో రంగం సంక్షోభం వైపు ప్రయాణిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తున్నది.

కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి నిరుద్యోగులను, చిరుద్యోగులను, వారి ఆశలనూ సోపానాలుగా వాడుకున్నది. లైబ్రరీల చుట్టూ, కోచింగ్ సెంటర్ల చుట్టూ రాహుల్‌గాంధీ, దీపా మున్షీలతో సహా కాంగ్రెస్ నాయకులందరూ చక్కర్లు కొట్టారు. వీరికి తోడుగా తమను తాము ప్రశ్నించే గొంతుకలుగా ప్రచారం చేసుకున్న మరికొన్ని నోళ్లు కూడా తోడై నిరుద్యోగుల్లో భ్రమలను పెంచారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరుతాయని నమ్మబలికారు. ఢిల్లీ స్థాయిలోని అగ్రశ్రేణి కాంగ్రెస్ నేతలు తమ దగ్గరికి వచ్చి హామీలివ్వడంతో సహజంగానే ఉద్యోగార్థులు ఆశలు పెంచుకున్నారు. గత ప్రభుత్వంలో కన్నా మిన్నగా తమ ప్రయోజనాలు నేరవేరుతాయనే గంపెడాశతో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి పూనిక వహించారు. రాష్ట్రంలో గడప గడపా తిరిగి, ప్రతి ఓటరునూ గడుమ పట్టుకొని బతిమిలాడి తమ ముఖం చూసి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. అయితే నిరుద్యోగులను వాడుకొని గద్దెనెక్కిన కాంగ్రెస్.. నిరుద్యోగుల ఆశల మీద తట్టెడు మన్ను పోసింది. అధికారంలోకి వచ్చి సుమారు ఏడు నెలల కాలం గడిచిపోయింది. ఒక్కటంటే ఒక్క కొత్త నోటిఫికేషన్ రాలేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దుచేసి నామమాత్రంగా కొన్ని పోస్టులు కలిపి ఇదే కొత్త నోటిఫికేషన్ పొమ్మన్నారు. మొదటి క్యాబినెట్‌లోనే 25 వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇక్కడ కూడా పాత నోటిఫికేషన్‌కు అదనంగా 5 వేల పోస్టులు కలిపి చేతులు దులుపుకొన్నది. మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చింది. దీంతో నిరుద్యోగుల గుండెలు భగ్గుమన్నాయి. ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీకి కట్టుబడి, గ్రూప్-1 పోస్టులు మరో 2,000 పెంచాలని, గ్రూప్-3కి సంబంధించి మరో 3000 పెంచాలనీ, 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వాలని నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 చొప్పున అనుమతించాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని అసెంబ్లీ వేదికగా డిమాండ్ చేశారు. ఇప్పుడు అదే డిమాండ్ అభ్యర్థులు చేస్తుంటే సాంకేతిక కారణాల రీత్యా సాధ్యం కాదని అణచివేతకు దిగుతున్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు కనిపించని సాంకేతిక కారణాలు అధికారంలోకి రాగానే ఎందుకు కనిపిస్తున్నాయనే అభ్యర్థుల ప్రశ్నకు ప్రభుత్వం నుంచి సమాధానం రావడం లేదు. నిరుద్యోగులు కోరుతున్నవి గొంతెమ్మ కోరికలేమీ కాదు. అన్నీ కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలే. ఎంత విచిత్రమంటే పరీక్షకు పరీక్షకు మధ్య కొంత వ్యవధి ఇవ్వాలని, తద్వారా ప్రిపరేషన్ విషయంలో తమపై ఒత్తిడి లేకుండా చూడాలనే చిన్న కోరికను కూడా చెవిన పెట్టడం లేదంటే ఈ ప్రభుత్వం ఎంత అహానికి పోతున్నదో అర్థం చేసుకోవచ్చు. గురుకుల టీచర్ పోస్టుల భర్తీలోని అవకతవకలను సవరించాలని రోడ్డెక్కిన వాళ్ల దిక్కు చూసిన పాపాన పోవడం లేదు.

రెండు లక్షల ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్తూ మ్యానిఫెస్టోలో తేదీల వారీగా షెడ్యూల్‌ను కూడా పేర్కొన్న కాంగ్రెస్ ఇప్పుడు అంతా తూచ్ అంటూ ఉల్టా నిరుద్యోగులను నిందిస్తున్నది. నిన్నటిదాకా నిరుద్యోగులను తమ మిత్రులుగా ప్రచారం చేసుకున్న కాంగ్రెస్ నేడు దుష్మన్లుగా చూస్తున్నది. పోస్టుల సంఖ్యను పెంచరు, మెగా డీఎస్సీ వేయరు, పరీక్షల తేదీలు మార్చరు, ఇస్తామన్న నిరుద్యోగ భృతి ఇవ్వరు, జాబ్ క్యాలెండర్ అయితే పత్తా లేదు. ఈ దశలో తమ డిమాండ్ల సాధన కోసం మోతీలాల్ నాయక్ అనే విద్యార్థి నాయకుడు ఆమరణ నిరాహార దీక్షకు పూనుకోవాల్సి వచ్చింది. ఆయన నిరాహార దీక్షకు బీఆర్‌ఎస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు మద్దతు పలికాయి. గత దశాబ్ద కాలంలో బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఎక్కడ నిరసన టెంటు వేసినా అక్కడ జరూరుగా ప్రత్యక్షమైన సోకాల్డ్ సివిల్ సొసైటీ పెద్దలకు మోతీలాల్ మొర వినిపించడం లేదు, దీక్ష కనిపించడం లేదు. సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యతను విస్మరించి బుజ్జగింపులకు దిగుతున్న కాంగ్రెస్ నాయకుల కపట వైఖరిని నిరుద్యోగులు అడుగడుగునా ఎదిరిస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి నిరుద్యోగులకు తాము ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చాలి. లేదా ఏ నిరుద్యోగుల భుజాల మీద ఎక్కి గద్దెపై కూర్చున్నారో అదే నిరుద్యోగుల నిరసన జ్వాలలు ఈ ప్రభుత్వాన్ని నిలువునా దహించకమానవు.

తమది కంచెలు లేని ప్రభుత్వమనీ, సామాన్యులకు అందుబాటులో ఉంటూ జనరంజక పాలన అందించే ప్రభుత్వమనీ, తమ పాలన ప్రజాపాలన అనీ డాంబికాలు పలికిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు పోలీసుల భద్రతా వలయాలలో, తుపాకుల, లాఠీల పరిరక్షణలో, నిరుద్యోగులకు అందకుండా తిరుగుతున్నారు, అణచివేతలకు పాల్పడుతున్నారు. ఇదంతా ప్రజాస్వామ్యమే అని సోకాల్డ్ మేధావులు కితాబులిస్తున్నారు. ఇదీ సాడే సాత్ సర్కార్ పాలనా వ్యవహారం.

ఇక క్షేత్రస్థాయిలో పనిచేసే చిరుద్యోగుల పరిస్థితి కనాకష్టంగా మార్చింది కాంగ్రెస్ ప్రజా పాలన. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామీణ జీవన ప్రమాణాలు పెంచేందుకు పల్లెప్రగతి కార్యక్రమాన్ని చేపట్టి గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల కల్పన చేసింది. ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్, ట్యాంకర్ అందుబాటులోకి తెచ్చింది. దీంతో చెత్త సేకరణ చక్కగా జరిగింది. గ్రామాల్లో పరిశుభ్రత పెరిగింది. పారిశుద్ధ్యం మెరుగుపడటంతో ప్రజలు రోగాల బారినపడే ప్రమాదం తప్పింది. గ్రామ సీమలు పచ్చగా వర్ధిల్లాయి. కాంగ్రెస్ సర్కారు ఈ ఏడు నెలల్లో గ్రామాలను తిరిగి మురికి కూపాలుగా మార్చే దిశగా పయనిస్తున్నది. ట్రాక్టర్లు నడిపేందుకు కావాల్సిన డీజిల్ కోసం డబ్బులు విడుదల చేయకపోవడంతో అవి నిరుపయోగంగా పడిఉన్నాయి. కొన్నిచోట్ల అధికారులు అప్పులు చేసి ట్రాక్టర్లలో డీజిల్ పోయిస్తున్నారంటే పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యాన్ని నిర్వహించే మల్టీ పర్పస్ వర్కర్స్‌కు ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదు. వారు అలో లక్ష్మణా అని అలమటిస్తున్నారు. దీంతో ప్రజలు అపరిశుభ్రతతో వచ్చే వ్యాధుల బారిన పడి దవాఖానాల చుట్టూ తిరుగవలసి వస్తున్నది. వర్షాకాలం కూడా కావడం వల్ల రాబోయే రోజుల్లో ఇది మరింత ముదిరే ప్రమాదం ఉన్నది.

ప్రజలకు, దవాఖానాలకు మధ్య వారధిగా పనిచేసే ఆశా వర్కర్లు కూడా జీతాలు లేక అలమటిస్తున్నారు. విధిలేక ధర్నాలకు దిగుతున్నారు. బీఆర్‌ఎస్ పరిపాలనలో ఆశాలకు ఇచ్చే పారితోషికం రూ.1500 నుంచి రూ.9750కి పెరిగింది. కాంగ్రెస్ చెప్పిన మార్పు ఫలితంగా తమ జీతాలు మరింత పెరుగుతాయని ఆశించిన ఆశాలకు తీవ్ర ఆశాభంగం ఎదురైంది. అంగన్వాడీలదీ అదే పరిస్థితి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ కాలంలో అంగన్వాడీలకు ఇచ్చే వేతనం రూ.4,200 నుంచి రూ.13,650లకు పెరిగింది. వీరి జీతం రూ.18 వేలకు పెంచుతామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఆడంబరంగా ప్రకటించింది. ఇప్పుడు యథావిధిగా మొండిచేయి చూపిస్తున్నది. అంగన్వాడీ కేంద్రాల అద్దెలు కూడా చెల్లించక ప్రభుత్వం వారిని అనేకరకాల తిప్పలు పెడుతున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన నిధులను కాంగ్రెస్ సర్కార్ ఇవ్వడం లేదు. చివరికి వంట చేసే సిబ్బందికి ఇచ్చే కొద్ది మొత్తాన్ని కూడా చెల్లించక ఉసురు పోసుకుంటున్నది.

> ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 5 విడతల కరువు భత్యం ఇవ్వవలసిన ఉన్నది. అధికారంలోకి రాగానే తక్షణమే చెల్లిస్తామని చెప్పిన సర్కార్ ఇప్పటివరకు ఒక్క విడత కరువు భత్యం కూడా చెల్లించలేదు. మార్చి నుంచి రిటైర్ అయిన ఉద్యోగులకు వారి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదు. గ్రాట్యూటీ, ఇతర చెల్లింపులు నిలిపివేశారు. వృద్ధాప్యంలో తమకు రావాల్సిన కష్ట ఫలితం రానందుకు రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఇక పీఆర్‌సీ కాల పరిమితి ముగిసినా ఇప్పట్లో ఇస్తారనే ఆశే లేదు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీం అయితే పూర్తిగా అటకెక్కింది.

రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపు తప్పుతున్నాయని ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలు సూచిస్తున్నాయి. హైదరాబాద్‌లో వరుస హత్యలు కలవరపెడుతున్నాయి. తెలంగాణలో ఎన్నడూ లేని రాజకీయ హత్యలు, దాడులు కాంగ్రెస్ పాలనలో మళ్లీ మొదలయ్యాయి. పరిపాలన మీద దృష్టి సారించవలసిన ముఖ్యమంత్రి ఇంకా పీసీసీ ప్రెసిడెంట్‌గా రాజకీయ కార్యకలాపాల్లోనే మునిగి తేలుతున్నారు. అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకోవడం కోసం ఢిల్లీకి, ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చట్టవిరుద్ధంగా తమ పార్టీలో కలుపుకొనే పనిలో వారి ఇండ్లకు తిరగడానికే సమయం సరిపోతున్నది. ప్రజాపాలన జరగకపోగా ప్రతిపక్షాలపై ప్రతీకార పాలన కొనసాగుతున్నదని, పరిపాలన క్రమంగా గాడితప్పి పోతున్నదనే భావన జనంలో నెలకొన్నది. ఇప్పటికైనా ప్రభుత్వం డంబాచారం మాని, డాంబికాలకు పోకుండా చిత్తశుద్ధితో పాలన మీద దృష్టిపెట్టాలి. ముఖ్యంగా ఆరు గ్యారంటీల అమలు మీద శ్రద్ధ పెట్టాలి. ప్రజాక్షేత్రంలో చెలరేగుతున్న ఆందోళనలను ప్రతికూల దృష్టితో చూడకుండా, ఇచ్చిన హామీలకు కట్టుబడి సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు. ఆ వివేకం మరిచి ప్రవర్తిస్తే ఈ ప్రభుత్వం అతి తొందరలోనే తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను చవిచూడవలసి వస్తుంది.

(వ్యాసకర్త: బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి)

ట్రంప్ నో, బైడెన్ నోనో!

టంకశాల అశోక్

పరిస్థితులు ఒకోసారి విచిత్రంగా ఉంటాయి. ప్రస్తుతం అమెరికా అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్‌ల విషయంలో అదే కనిపిస్తున్నది. బైడెన్ ప్రస్తుతం అధ్యక్షుడు. డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా తిరిగి పోటీ పడుతున్నారు. ట్రంప్ మాజీ అధ్యక్షుడు. పోయినమారు బైడెన్‌తో కొద్ది తేడాతో ఓడిన ఆయన రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా మళ్లీ పోటీలో ఉన్నారు. అధ్యక్ష స్థానానికి పోటీ పడే అభ్యర్థుల మధ్య వివిధ అంశాలపై బహిరంగ చర్చ జరిపే అమెరికన్ సంప్రదాయం ప్రకారం వీరిద్దరూ గురువారం రాత్రి చర్చకు తలపడ్డారు. ట్రంప్ మంచివాడు కాదని, బైడెన్ బలహీనుడని అమెరికాలో గల విస్తృతమైన అభిప్రాయం. అయినప్పటికీ బైడెన్ కన్న ట్రంప్‌నే తాము కోరుకుంటున్నామని ఈ చర్చ తర్వాత జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో మెజారిటీ ప్రజలు తేల్చి చెప్పారు. పరిస్థితులు ఒకోసారి విచిత్రంగా ఉంటాయనేది ఇది చూసే.

బైడెన్, ట్రంప్‌ల మధ్య వచ్చే నవంబర్ 4న ఎన్నికలలోగా రెండు విడతల చర్చ జరుగనున్నది. మొదటిది ఈ గురువారం రాత్రి అట్లాంటాలో సీఎన్‌ఎన్ వార్తా సంస్థ ఆధ్వర్యాన జరుగగా, రెండవది సెప్టెంబర్ 27న కాలిఫోర్నియాలో ఏబీసీ వార్తా సంస్థ నిర్వహించనున్నది. ఈ మొదటి చర్చలో ఏయే అంశాలు ప్రస్తావనకు వచ్చాయి? వాటిగురించి ఎవరేమి చెప్పారు? అనేవి సాధారణంగా ముఖ్యం కావాలి. దాన్ని బట్టి ఎవరి విధానాలేమిటి, అందువల్ల అమెరికా పరిస్థితి ఏ విధంగా ఉండగలదనే విషయమై ప్రజలు ఒక అభిప్రాయానికి వచ్చి ఆ ప్రకారం ఓటు చేస్తారు. అదేవిధంగా, తమ సమస్యలేమిటి, వాటికి ఎవరి వద్ద ఏ సమాధానాలు ఉన్నాయో కూడా చూస్తారు. మూడవ ముఖ్యమైన అంశం, గత నాలుగేండ్ల పాలనలో జరిగిన పొరపాట్లేమిటని ఇద్దరు అభ్యర్థులు గుర్తిస్తారు, వాటిని ఎట్లా సరిదిద్దగలమని ప్రజలకు హామీ ఇస్తారనేది కూడా పరిశీలనకు వస్తుంది. సాధారణ దేశాల్లోనే ప్రజలకు ఇటువంటి దృష్టి ఉండే స్థితిలో, అమెరికా వంటి అగ్రరాజ్యం గురించి చెప్పనక్కరలేదు.



గురువారం నాడు ఈ విధమైన అంశాలు చర్చకు రాలేదని కాదు. కాని విచిత్రమైన రీతిలో చివరికి, ఆయా అంశాలపై ఎవరేమి చెప్పారనే దానికన్న, బైడెన్, ట్రంప్‌లలో ఎవరు ధాటిగా మాట్లాడారు? ఆ ధాటిని ఎవరు తట్టుకోగా ఎవరు తడబడిపోయారన్నదే ప్రధానంగా మారింది. సాధారణ అమెరికన్ ప్రజలకే కాదు, అక్కడి మీడియాకు, పలువురు ఆలోచనాపరులకు, చివరికి ఇద్దరు అభ్యర్థుల మద్దతుదారులకు, సొంత పార్టీ ఆర్గనైజర్లకు కూడా. చర్చ ముగిసిన కొద్ది గంటలలోనే ఇది ఎంతవరకు పోయిందంటే, ట్రంప్‌ను ఓడించాలంటే బైడెన్ పోటీ నుంచి తప్పుకొని మరొక అభ్యర్థిని ఎంపిక చేసుకోక తప్పదని బైడెన్ పార్టీ ముఖ్యులే మాట్లాడటం మొదలుపెట్టారు. న్యూయార్క్ టైమ్స్ ఎడిటోరియల్ బోర్డు ఒక బహిరంగ వ్యాసమే రాస్తూ, ట్రంప్ మంచివాడు కాదని, ఓడిపోవాలని, కాని ఆ పని బైడెన్ వల్ల కాదనే విషయం తేలినందున కొత్త అభ్యర్థిని ముందుకు తేవాలని తేల్చిచెప్పింది. చర్చను నిర్వహించిన సీఎన్‌ఎన్ వార్తా సంస్థ ఆ వెంటనే ప్రజాభిప్రాయ సేకరణ జరపగా, 67 శాతం మంది ట్రంప్ చర్చ బాగున్నదనగా, 33 శాతం మాత్రమే బైడెన్‌కు ఓటు వేశారు. ఎవరి చర్చ బాగుండవచ్చునని చర్చకు ముందు పోలింగ్ జరుపగా ట్రంప్‌కు 55 శాతం, బైడెన్‌కు 45 శాతం వచ్చిన ఓట్లు చర్చ తర్వాత ఆ విధంగా మారిపోయాయి. ఇదంతా చాలదన్నట్టు, ఆ మరునాడు శుక్రవారం నార్త్ కాలిఫోర్నియాలో జరిగిన ఎన్నికల సభలో బైడెన్ తన దెబ్బతిన్న ప్రతిష్ఠను తిరిగి సంపాదించుకునేందుకు ప్రయత్నిస్తూ దృఢంగా మాట్లాడనైతే మాట్లాడారు. కాని అదే సమయంలో, 'నేను ఇదివరకంత తేలికగా నడవలేను. ఇది వరకంత సాఫీగా మాట్లాడలేను. ఇదివరకంత బాగా చర్చలో పాల్గొనలేను' అనటంతో మిగిలిన పరువు కూడా పోయింది. తన మద్దతుదారులకు గుండెలు ఇంకా దిగజారి ఉంటాయి.

ట్రంప్ వయసు 78 కాగా, బైడెన్‌కు 81 ఏండ్లు. గురువారం నాటి చర్చలో బైడెన్ మాటలు చాలాసార్లు తడబడ్డాయి. ఆయనకు వయస్సు మీరుతున్నందున సరిగా మాట్లాడలేకపోతున్నారని, ఆలోచనలకు, మాటలకు ఒకోసారి లంగరందక మధ్య మధ్య అంతరాయాలు వస్తున్నాయనే విమర్శలు సుమారు రెండేండ్లుగా ఉన్నాయి. ట్రంప్ వయస్సు కూడా తక్కువ కాదు గాని ఆయనకు ఇటువంటి సమస్యలు లేవు. ఇదంతా గురువారం నాడు ప్రతిఫలించింది. ట్రంప్ ధాటితో బైడెన్ మరింతగా తడబడ్డారు. వయసు మీరిన బైడెన్ మరొక నాలుగేండ్లు అధ్యక్ష బాధ్యతలను నిర్వహించలేరని గతం నుంచే అభిప్రాయాలున్న స్థితిలో ఆయన స్వయంగానైనా పోటీకి దూరంగా ఉండవలసింది. లేదా తన పార్టీ ఆ నిర్ణయం తీసుకోవలసింది. గురువారం నాటి చర్చ దరిమిలా ఈ చేదు మాటలు అందరికీ తెలిసివచ్చి ఉండాలి. కానీ, ఒకవేళ అభ్యర్థిని మార్చదలిచినా ఈ దశలో సాధ్యమా అనే ప్రశ్న ఉంది. అసాధ్యమని, లేదా కష్టం మీద సాధ్యమనే చర్చలు ఇప్పటికే పార్టీలో మొదలయ్యాయి. ఏది జరగాలన్నా మొదట బైడెన్ అంగీకరించవలసి ఉంటుందని, ఆయన సుముఖంగా కన్పించటం లేదని కొన్ని వార్తలు వెలువడ్డాయి. ఈ విధమైన చర్చలు, విమర్శలు రాగల వారాలలోనూ సాగుతూనే ఉంటాయి. బైడెన్‌కు అనుకూలంగా జరిగేది బహుశా ఏమీ ఉండకపోవచ్చు. అనగా తనతో పాటు తన పార్టీ నైతిక బలం ఇంకా తగ్గుతుందనుకోవాలి. ఈ పరిస్థితుల మధ్య సెప్టెంబర్ 27 కాలిఫోర్నియా చర్చ ఏవైనా అద్భుతాలు చేయగలదా? చివరికి ఏమి జరిగినా, జరగకున్నా అసలు ఇటువంటి చర్చే బైడెన్‌కు అవమానకరమని వేరే చెప్పనక్కరలేదు. ఇదిలా ఉండగా బైడెన్ వైఫల్యాన్ని గమనించిన విరాళాల దాతలు ఇప్పుడు అందుకు సందేహిస్తున్నారట!

> ఇదంతా బైడెన్, ట్రంప్‌ల చర్చాశైలి, ఆరోగ్యస్థితికి సంబంధించిన విషయం. ఓటర్లకు ఇరువురి విధానాలు, పరిపాలనలకన్న ఇవే తక్షణ సమస్యలుగా మారటం ఒక విచిత్ర స్థితి. అట్లాగని ఇతర అంశాలు చర్చకు రాలేదని, అవి ప్రజల దృష్టిలో లేవని కాదు. మొదట చెప్పుకొన్నట్టు ట్రంప్ అధ్యక్ష కాలానికి, వ్యక్తిగత వ్యవహరణకు సంబంధించి విమర్శలు చాలానే ఉన్నాయి. ఆయన పోయినసారి ఓడినపుడు తన సమర్థకులు అధ్యక్ష భవనంపై దాడి చేయటం, ఆయన వెంటనే పదవిని వదిలి వెళ్లిపోకపోవటం, నల్ల జాతీయులపై, మెక్సికన్ వలసదారులపై దాడులు, కొవిడ్ సమస్యను నిర్లక్ష్యం చేయటం, వేశ్యలతో సంబంధాలు, తరచూ అబద్ధాలు చెప్పటం, ఈ చర్చ సందర్భంగానూ కొన్నిసార్లు అదే పనిచేయటం వంటి తీవ్రమైన విమర్శలు ఆయనపై ఉన్నాయి. అవి గతంలో ఉండగా చర్చ సమయంలో బైడెన్ వాటిని ప్రస్తావించి ట్రంప్‌ను ఆత్మరక్షణలోకి నెట్టజూశారు. కానీ, ప్రజలు ఒకసారి ఒకరిని బలపరచేందుకు మానసికంగా సిద్ధమైనప్పుడు, వారు చెప్పేవి అసత్యాలని తెలిసినప్పటికీ మారరు. ఇదొక గమనించదగ్గ విశేషం.

ట్రంప్‌పై ఈ తరహా విమర్శలను గత నాలుగేండ్లుగా వింటున్న అమెరికన్లు అందుకు అలవాటుపడిపోయారు. వారికి తమ నిత్య జీవిత సమస్యలు ప్రధానంగా మారాయి. అటువంటి సమస్యలు లేని వర్గాలకు మాత్రం ట్రంప్ ఇంకా విలన్‌గా నిలిచిపోయారు. వాస్తవానికి గత ఎన్నికల్లోనూ దిగువస్థాయి వర్గాలు ట్రంప్‌ను పూర్తిగా బలపరిచాయి. ఆయనపై అప్పటికి ఉండిన కొన్ని ఆరోపణలను విస్మరించాయి. బైడెన్ అధ్యక్షుడైన నాలుగేండ్లలో ట్రంప్ గురించిన మరి కొన్ని విమర్శలు వెలువడ్డాయి. కానీ, తన మద్దతుదారులు వీటిని కూడా పట్టించుకోవటం లేదు. దీనికి సంబంధించే బైడెన్ నాలుగేండ్లలో ముఖ్యమైనవి రెండు జరుగుతున్నట్టు ఈ వర్గాల ప్రజలు భావిస్తున్నారు. అందులో మొదటిది ఆర్థికవ్యవస్థ బలహీనపడుతూ ఉపాధి కల్పన దెబ్బతింటుండటం. రెండవది, అక్కరలేని ఉక్రెయిన్ యుద్ధాన్ని సృష్టించి అందుకు లక్షల కోట్ల డాలర్లు, అంతులేని ఆయుధాలు ధారపోయటం. బైడెన్ నాయకత్వం నాటో సైనిక కూటమిని రష్యా వైపు విస్తరిస్తున్న కారణంగానే తమ భద్రత కోసం భయపడుతున్న రష్యా, ఉక్రెయిన్‌పై దాడికి సమకట్టిందన్నది అందరికీ తెలిసిన విషయమే. ఇరువురి మధ్య రాజీ ప్రయత్నాలను కూడా అమెరికా సాగనివ్వటం లేదు. మొత్తానికి ఆ యుద్ధానికి అవుతున్న భారీ వ్యయాన్నంతా తమపై పన్నుల రూపంలో వసూలు చేస్తున్నారన్నది అమెరికా సామాన్యుల నిరసన. అదే స్థితి వల్ల ధరల పెరుగుదల, నిరుద్యోగం, జీవన ప్రమాణాల పతనం మొదలైనవి జరుగుతున్నాయన్నది వారి ఫిర్యాదు. ఈ సమస్యలను ట్రంప్ కొంత కాలం నుంచే ప్రస్తావిస్తూ, ఇప్పుడు చర్చ సందర్భంగా తిరిగి బలంగా లేవనెత్తారు. తాను ఎన్నికైన పక్షంలో ప్రమాణ స్వీకారానికి ముందే పుతిన్, జెలెన్‌స్కీలతో మాట్లాడి రాజీ కుదర్చగలనని ప్రకటించటం సామాన్య ప్రజలను బాగా మెప్పించినట్టు కనిపిస్తున్నది. అది సాధ్యమా అన్నది వేరే ప్రశ్న.

గాజా యుద్ధం మరొక ముఖ్యాంశం. స్వయంగా యూదులైన బైడెన్, ట్రంప్ ఇద్దరూ ఇజ్రాయెల్ సమర్థకులే. కానీ, ఆ పని ట్రంప్ మాటలలో చేస్తుండగా, చేతల రూపంలో చేస్తున్న బైడెన్ అన్నివర్గాల ప్రజల్లో ఆ మేరకు వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. ఇజ్రాయెల్ ఎంత దారుణమైన హత్యాకాండ సాగిస్తున్నా కుప్పతెప్పలుగా ఆయుధాలను, నిధులను నిరంతరం సరఫరా చేయటం, ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ న్యాయస్థానం సహా ప్రపంచ జనాభిప్రాయాన్ని ఖాతరు చేయక ఇజ్రాయెల్‌ను బలపరచటం బైడెన్‌ను ఒక సహ హంతకునిగా నిలబెడుతున్నది. పైన పేర్కొన్న వ్యక్తిగత బలహీనతలకు తోడు ఇటువంటి వివిధాంశాలు అన్నీ బైడెన్‌కు వ్యతిరేకంగా మోహరిస్తున్నట్టు భావించాలి. అందువల్లనే, ట్రంప్‌కు ఒక నో రిమార్క్ వచ్చినా బైడెన్‌కు రెండు నో రిమార్కులు వస్తున్నట్టు కనిపిస్తున్నది. మొత్తమ్మీద, ఒక గొప్ప ప్రజాస్వామిక దేశంగా భావించే అమెరికా అధ్యక్ష అభ్యర్థులలో ఎవరైనా గొప్పవారున్నారా అన్నది బయటి ప్రపంచానికి కలిగే సందేహం.

సిరి నుంచి ఉరి వైపు..

ప్రజాపాలనలో చేనేత కార్మికుల ఆశ, శ్వాస అయిన సాంచల సప్పుడు రోజురోజుకు వినపడకుండా పోతున్నది. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేసే పనిలో భాగంగా కాంగ్రెస్ సర్కార్ సిరిసిల్లపై దృష్టిపెట్టింది. అందుకే నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

ఫణి రాజారావు రామినేని
94400 52555

సిరిసిల్ల కార్మిక క్షేత్రంలో 30 వేల పవర్‌లూంలు ఉండగా.. వాటిలో 15 వేల వరకు కాటన్ బట్టను ఉత్పత్తి చేస్తే, మిగతా 15 వేల పవర్‌లూంలు పాలిస్టర్ వస్త్రాన్ని ఉత్పత్తి చేసేవి. కాటన్ బట్ట పరిశ్రమకు అనుబంధంగా 26 సైజింగ్‌లు, 130 వరకు చిన్న తరహా డయింగ్ యూనిట్లు మనుగడ సాగిస్తున్నాయి. అంతేకాకుండా, సుమారు 3 వేల మంది కార్మికులు ఆటో నడుపుతూ.. రవాణా, హమాలీలుగా పనిచేసేవారు. 30 వేల పైచిలుకు పవర్‌లూంలు, అనుబంధ పరిశ్రమలపై ఆధారపడుతూ 25 వేల మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారు.

ఎన్టీఆర్ మొదలు చంద్రబాబు, వైఎస్సార్, కిరణ్ కుమార్ రెడ్డి వరకు ఉమ్మడి ఏపీలో ఎంతో మంది ముఖ్యమంత్రులు నేతన్నల కష్టాలను, వారి బలవన్మరణాలను రాజకీయాలకు వాడుకున్నారే తప్ప, ఏనాడూ ఆదుకోలేదు. సిరిసిల్ల నేతన్నల సంక్షేమం కోసం కృషి చేసిన పాలకుడు కేసీఆర్ మాత్రమే. నేతన్నల సమస్యలపై పూర్తిగా అవగాహన ఉన్న కేసీఆర్ కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. తెలంగాణ తొలి ప్రభుత్వం కొలువయ్యాక స్థానిక ఎమ్మెల్యే, మంత్రి హోదాలో కేటీఆర్ వారి ఆకలిచావులను, ఆత్మహత్యలను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సిరిసిల్ల నేత పరిశ్రమను కుటీర పరిశ్రమగా గుర్తించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఆయన కృషి ఫలితంగా 2006 నుంచి పేరుకుపోయిన విద్యు త్తు బకాయిలపై ప్రభుత్వం 50 శాతం రాయితీ ప్రకటించింది. దాంతో నేత పరిశ్రమ కష్టాల సుడిగుండం నుంచి బయటపడింది. అంతేకాదు, నేత కార్మికుల కుటుంబాలకు 35 కిలోల బియ్యం ఉచితంగా ఇచ్చేలా అంత్యోదయ కార్డులను ఇచ్చింది. స్త్రీలకు పావలా వడ్డీకే రుణాలను అందజేసింది. స్త్రీ స్వయం శక్తి పొదుపు సంఘాలను ప్రోత్సహించింది.

> నేతన్న బీమా, పెన్షన్ వర్కర్ టు ఓనర్ మొదలైన సంక్షేమ పథకాలను అమలు చేసింది. రూ.350 కోట్ల విలువైన బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చింది. అంతేకాకుండా రాజీవ్ విద్యా మిషన్ పాఠశాల యూనిఫాంలు, క్రైస్తవులు, ముస్లిం సోదరులకు ఇచ్చే వస్త్రాలను కూడా సిరిసిల్ల పరిశ్రమకే ఆర్డర్లు ఇచ్చింది. తద్వారా నేత కార్మికుల ఆత్మహత్యలు, ఆకలిచావులు పూర్తిగా తగ్గిపోయాయి.

కానీ, కొంతమంది కేసీఆర్ సర్కార్‌పై విషం చిమ్మారు. సిరిసిల్ల వ్యాపార క్షేత్రం తన సహజ లక్షణాన్ని కోల్పోయిందని, పూర్తిగా ప్రభుత్వంపై ఆధారపడేలా చేశారని దుష్ప్రచారం చేశారు. కానీ, సిరిసిల్ల అప్పారెల్ పార్క్‌లో వేల మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. ఒక్కో మహిళ నెలకు రూ.8 వేల నుంచి రూ.12 వేల వరకు సంపాదిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నది. అనేక కొత్త సంస్థలు అప్పారెల్ పార్కులో యూనిట్లను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇలా అనేక కార్యక్రమాలు చేపట్టిన కేసీఆర్ సర్కార్ నేతన్నల ఆత్మహత్యలను నివారించింది.

కానీ, ప్రజాపాలన అంటూ గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. సంక్షేమ కార్యక్రమాలకు మంగళం పాడుతుండటంతో మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు మొదలయ్యాయి. దశాబ్దం పాటు సాగిన బీఆర్‌ఎస్ పాలన సిరిసిల్లను ఉరి శాల నుంచి సిరిశాల వైపు మళ్లించింది. కానీ, రేవంత్ ప్రభుత్వం సిరిసిల్లను మళ్లీ ఉరిశాల వైపు నడిపిస్తున్నది. రేవంత్ పాలనలో సిరిసిల్లలో ఇప్పటికే 8 మంది ఆత్మహత్య చేసుకున్నారు. కార్మికుల బలవన్మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలి. నాసిరకపు సాంచలను ఆధునికీకరించాలి. గత ప్రభుత్వం వలె సంక్షేమ పథకాలను అమలు చేసి కార్మికుల ఆత్మ బలిదానాలకు అడ్డుకట్ట వేయాలి.